క్లుప్తంగా

గిరిజనుల అభివృద్ధికి కృషి



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నిర్వాహకులు

బడంగ్‌పేట్: గిరిజనుల అభివృద్ధికి కృషి చేస్తామని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. ఆదివారం గుర్రంగూడలో సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె సేవాలాల్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం సబితారెడ్డిని ఉత్సవ నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మేయర్ పారిజాత, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ గ్రామ కమిటీ ఎన్నిక



నూతన కమిటీకి నియామక పత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కందుకూరు: కాంగ్రెస్ పార్టీ గూడూరు గ్రామ శాఖ నూతన కమిటీని ఆదివారం ఏక గ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ పార్టీ మండల కోఆర్డినేటర్ ఎండీ అఫ్జల్‌బేగ్ ప్రకటించారు. అధ్యక్షుడిగా ఐనవోలు శ్రీకాంత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా గోల్కండ సాయిలు, జనరల్ సెక్రటరీగా నర్ల రాఘవేందర్, యూత్ అధ్యక్షుడిగా పోల్దాస్ అరవింద్, ఉపాధ్యక్షుడిగా చిలుకల శ్రీరాములు, యూత్ జనరల్ సెక్రటరీగా ఎస్. రాము, కమిటీ సభ్యులుగా నర్సింహ, కుమార్, సురేందర్, లింగయ్య, కిషన్, అజ్జు, దేవేందర్, శేఖర్, రాంబాబు, నర్సింహ, శ్రీకాంత్, బాలు యోహాను, శ్రీను, శ్రీశైలం, సుధాకర్, మహేందర్, ప్రవీణ్, శ్రీను, రఫిక్, విజయ్, బాలకృష్ణలను నియమించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బుక్క పాండు రంగారెడ్డి పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే దోహదం

డీసీసీబీ ఛైర్మన్ సత్తయ్య



డీసీసీబీ ఛైర్మన్‌ను సన్మానిస్తున్న కరాటే అకాడమీ సభ్యులు

తుర్కయంజాల్ : కరాటేతో విద్యార్థుల్లో మానసిక ధైర్యం పెరుగుతుందని డీసీసీబీ ఛైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అన్నారు. ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని రొక్కం సత్తిరెడ్డి గార్డెన్‌లో ఏర్పాటు చేసిన వీఎస్ కరాటే అకాడమీ బెల్ట్ గ్రేడింగ్ ఎగ్జామ్ అండ్ సర్టిఫికేషన్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆత్మరక్షణకు కరాటే ఎంతో అవసరమని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మంగమ్మ, కాంగ్రెస్ పార్టీ నాయకులు శివకుమార్, వీఎస్ కరాటే అకాడమీ ఫౌండర్ నరేందర్, శ్రీనివాస్, నర్సింగ్, యాదిరెడ్డి, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

త్రిపుర గవర్నర్‌ను కలిసిన బీజేపీ నాయకులు



గవర్నర్‌ను సన్మానిస్తున్న పార్టీ నాయకులు

తుర్కయంజాల్: త్రిపుర గవర్నర్ ఇంద్రసేనా రెడ్డిని ఆదివారం రాజ్‌భవన్‌లో పలువురు బీజేపీ ఇబ్రహీంపట్నం నాయకులు కలిసి ఘనంగా సన్మానించారు. గవర్నర్‌ను కలిసిన వారిలో ఆ పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు ప్రతాప్, సీనియర్ నాయకులు గుర్రం శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి ఉన్నారు.

కేటీఆర్‌ను కలిసిన చంద్రశేఖర్‌రెడ్డి



కేటీఆర్‌తో చంద్రశేఖర్‌రెడ్డి

తలకొండపల్లి: మాజీ మంత్రి కేటీఆర్.. పార్లమెంట్ ఎన్నికల నిమిత్తం అచ్చంపేట్ పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ఆదివారం వచ్చారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ తలకొండపల్లి మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ప్రజాదరణ బీఆర్ఎస్ వైపే ఉందని, పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధిస్తామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

ఉర్సుకు ముస్తాబైన దర్గా

రేపటి నుంచి మార్చి4 వరకు ఉత్సవాలు

- ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు ముమ్మరం
- ప్రత్యేక పోలీసు బలగాలతో నిఘా
- దర్గా ఆవరణలో ఏర్పాటైన దుకాణ సముదాయాలు





కొండపైన బాబా షర్ఫుద్దీన్ దర్గా (ఇన్‌సెట్లో) దర్గాలో బాబా సమాధి

పహాడీషరీఫ్: ఉర్సు ఉత్సవాల సందర్భంగా పహాడీ షరీఫ్ బాబా షర్ఫుద్దీన్ దర్గా ముస్తాబయింది. అన్ని వర్గాల ప్రజలతో నిత్యం కళకళలాడుతూ, మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్న ఈ ప్రార్థనాలయంలో ఏటేటా ఉత్సవాలను వైభవంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. వక్ఫ్‌బోర్డు ఆధీనంలో ఉన్న ఈ దర్గాను పీర్‌జాదుగన్‌లు పర్యవేక్షిస్తున్నారు. ఈ దర్గాను దర్శించుకుంటే ఆయురారోగ్యాలతో పాటు, అనుకున్నది నెరవేరుతుందన్న విశ్వాసంతో ప్రజలు ఇక్కడ పెద్ద ఎత్తున గ్యార్మీ షరీఫ్‌లు నిర్వహిస్తుంటారు. ఈ సందర్భంగా భక్తజనం .. దర్గాలోని బాబా సమాధికి పూలు, ఛాదర్ సమర్పించి మొక్కులు తీర్చుకుంటుంటారు. ఈ నెల 27న ప్రారంభం కానున్న వేడుకలను పురస్కరించుకొని దర్గా ఆవరణలో దుకాణాలు, రంగుల రట్నాలు (జాయింట్ వీల్స్) ఏర్పాటవుతున్నాయి.

మార్చి 4 వరకు..

ఉర్సు ఉత్సవాలు రేపు రాత్రి నుంచి దర్గాలో నిర్వహించే ఖసీదయే బుర్దాషరీఫ్‌తో ప్రారంభమవుతాయి. అదేరోజు అర్ధరాత్రి 12 గంటలకు బాలాపూర్ గ్రామం చిల్లా నుంచి భక్తుల కోలాహలం మధ్య గంధం ఊరేగింపు మొదలవుతుంది. అక్కడి నుంచి కొత్తపేట, వెంకటాపూర్, షాహీన్‌నగర్, జల్‌పల్లి కమాన్ ప్రాంతం సమీపంలోని దర్గా శక్కర్ షా వలీ వద్ద ఫజర్ నమాజ్ నిర్వహిస్తారు. 28న ఉదయం 8 గంటలకు దర్గాపైకి ఊరేగింపు వెళ్తుంది. మార్చి 1న రాత్రి చార్మినార్ సమీపంలోని పంజెషా నుంచి నిజాం ట్రస్ట్ ఆధ్వర్యంలో గంధం ఊరేగింపు ప్రారంభం, మార్గ మధ్యలో జంగమ్మెట్ చిల్లా వద్ద అన్నదానం ఉంటుంది. అనంతరం కొనసాగింపుగా 2న ఉదయం పహాడీషరీఫ్ దర్గాకు చేరుకుంటుంది. 2న రాత్రి 7 గంటలకు దీపాలు, 3న రాత్రి స్థానిక ఠాణా నుంచి ఇన్‌స్పెక్టర్.. సందల్‌లో భాగంగా పూలు, చాదర్ తలపై పెట్టుకొని ఊరేగింపుగా వచ్చి సమర్పిస్తారు. 4న ఉస్లీ షరీఫ్ (పూల మాలల సమర్పణ)తో ఉత్సవాలు ముగుస్తాయి.

దట్టమైన అడవిలో ప్రార్థనలు

సుమారు 758 ఏళ్ల క్రితం ఇరాక్ దేశస్తుడైన కుతుబ్-హుల్-అక్తాబ్ షహెన్‌షా-ఇ-దక్కన్ సుల్తాన్-ఉల్ ఆరిఫీన్ హజ్రత్ బాబా షర్ఫుద్దీన్ మన దేశానికి వచ్చారు. పహాడీషరీఫ్ గ్రామంలోని ఎత్తైన కొండపై దట్టమైన అడవిలో ప్రార్థనలు ప్రారంభించారు. అలాంటి వాతావరణంతో బాబా.. ప్రార్థనలను చూసిన ప్రజలు ఆయనను ఆరాధించడం మొదలు పెట్టినట్లు చరిత్ర చెబుతోంది. భారత పర్యటనలో భాగంగా బాబా.. తొలిసారిగా బాలాపూర్ గ్రామంలో విశ్రాంతి తీసుకొని, అక్కడి నుంచి పహాడీషరీఫ్‌లోని కొండపైకి మకాం మార్చారు. ఇందులో భాగంగానే మొదటి గంధాన్ని బాలాపూర్ నుంచి తీస్తున్నారు.

మెట్లే ప్రధాన ఆకర్షణ



నవాబు హయాంలో నిర్మించిన మెట్లు

ప్రసిద్ధిగాంచిన దర్గాకు 360 మెట్లు ఒక ప్రత్యేక ఆకర్షణ నిలిచాయి. పూర్వం హైదరాబాద్ మొదటి నిజాం మహబూబ్ అలీ బాద్‌షా బాబా దర్శించుకునేందుకు వచ్చిన సమయంలో సుమారు వెయ్యి అడుగుల ఎత్తులో ఉన్న ఈ దర్గాకు.. సరైన మార్గం లేదు. దర్గా పైకి ఎక్కే సమయంలో నిజాం కాలికి గాయమైంది. దీంతో రాజునైన తనకే గాయాలైతే.. ఇక సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటని భావించిన ఆయన, దర్గాకు ఈ మెట్లు, పక్కనే మసీదును నిర్మించారు. నాడు నిర్మించిన మెట్లే.. నేటికీ చెక్కు చెదరకుండా ఉండటం మరో విశేషం. దర్గా పైకి చేరుకునేందుకు భక్తులకు కలుగుతున్న అసౌకర్యాన్ని గుర్తించిన ప్రభుత్వం.. రూ.16 కోట్ల వ్యయంతో 700 మీటర్ల పొడవు, 16 మీటర్ల ఎత్తు, 32 ఫీట్ల వెడల్పులో దర్గాపైకి ర్యాంప్ నిర్మాణ పనులను ప్రారంభించింది.

వైభవంగా నిర్వహిస్తాం



ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తాం. బాబా మొదటి సారి బాలాపూర్‌కు వచ్చిన గుర్తుగా ఏటా చిల్లా నుంచి నుంచి మొదలుకొని పహాడీషరీఫ్ వరకు గంధంతో కాలినడకన భక్తులు దర్గాలోకి ప్రవేశిస్తారు. ఇప్పటి వరకు బాబా ఆశీస్సులు పొందిన వారు విజయపథంలో కొనసాగుతున్నారు. ఇక్కడ జరిగే నిత్యాన్నదానంపై ఆధారపడి, వందలాది మంది యాచకులు కాలం వెళ్లదీస్తున్నారు. తమ శేషజీవితం గడుపుతున్నారు.

– ఇర్ఫాన్, దర్గా పర్యవేక్షకుడు

సకల సదుపాయాలు కల్పించాం



ఉత్సవాల సందర్భంగా అన్ని రకాల సదుపాయాలు కల్పించాం. ప్రత్యేకంగా మానిటరింగ్ సెల్‌ను ఏర్పాటు చేసి హెల్త్, ఎలక్ట్రికల్, ఫైర్, పోలీస్, వాటర్‌వర్క్స్, ఆర్టీసీ అధికారులతో సమన్వయం చేస్తూ ఆవరణలో మైక్ సదుపాయం ఏర్పాటు చేస్తున్నాం. పారిశుద్ధ్యం, నీటి సరఫరా సమస్య లేకుండా తగిన చర్యలు తీసుకుంటాం. అదనపు విద్యుత్ అవసరమైతే మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్‌ను అందుబాటులో ఉంచుతాం.

– అల్లూరి వాణి రెడ్డి, మున్సిపల్ కమిషనర్, జల్‌పల్లి

ప్రత్యేక బలగాలతో బందోబస్తు



ఉత్సవాలను పురస్కరించుకొని భారీ బందోబస్తు ఏర్పాటు చేసి, నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. 27న రాత్రి ప్రధాన ఊరేగింపు దారి పొడవునా ప్రత్యేక బలగాలు, రోప్ పార్టీలతో ఉన్నతాధికారుల పర్యవేక్షణలో బందోబస్తు కొనసాగుతుంది. దర్గా నిర్వాహకులు కూడా వలంటీర్లను నియమించుకోవాలి. ఉత్సవాలకు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలి. సంప్రదాయంలో భాగంగా పోలీస్‌స్టేషన్ నుంచి గంధం ఊరేగింపు నిర్వహిస్తాం.

– పి.గురువా రెడ్డి, పహాడీషరీఫ్ ఇన్‌స్పెక్టర్

మంత్రి వర్గంలో యాదవులకు స్థానం కల్పించాలి

తుక్కుగూడ: రాష్ట్ర మంత్రి వర్గంలో యాదవులకు స్థానం కల్పించాలని యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చక్రధర్ డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 14 శాతం జనాభ ఉన్న యాదవులపై రాష్ట్ర ప్రభుత్వం వివక్ష చూపుతుందని ఆరోపించారు. పార్లమెంటు ఎన్నికల లోపు యాదవులకు మంత్రి పదవి కేటాయించాలని కోరారు.

షబ్-ఏ-బరాత్



బైరాగిగూడలో సమాధుల వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

కందుకూరు: మండల పరిధి బైరాగిగూడలో ఆదివారం ముస్లింలు షబ్-ఏ-బరాత్ పండుగను నిర్వహించారు. ఈ సందర్భంగా సమాధులను శుభ్రం చేసి, పూలతో ఫాతిమాలు ఇచ్చి నమాజ్ చేశారు. అనంతరం ఖురాన్ పఠనం చేశారు.

క్రైస్తవులకు దుస్తుల పంపిణీ



దుస్తులు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధి రావిర్యాల యంబీ ఇమ్మానియేల్ చర్చిలో క్రైస్తవులకు ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు మాట్లాడారు. పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్ఆర్ సూచన మేరకు కార్యక్రమం చేపట్టినట్లు వారు పేర్కొన్నారు. ఇందులో మునగని రాజు, కోటగళ్ల రాజ్‌కుమార్, స్వామి తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో విద్యార్థులు

ఘనంగా అ'పూర్వ' సమ్మేళనం

కందుకూరు: కందుకూరు జిల్లా పరిషత్ పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది. 1994–95 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివిన వారంతా ఆదివారం కొత్తూర్ సమీపంలోని ఓ వెంఛర్‌లో ఏకమై సందడి చేశారు. నాటి చిలిపి చేష్టలు, తీపి జ్ఞాపకాలను గుర్తుకు చేసుకుంటూ ఆప్యాయంగా పలకరించుకున్నారు. అనంతరం పూర్వ ప్రధానోపాధ్యాయుడు గోపాలకృష్ణ, ఉపాధ్యాయులు వెంకటేశం, దుర్గాలత, జగన్మోహనాచారీ, పెంటారెడ్డి, పీఈటీ సుదర్శన్‌లను ఘనంగా సన్మానించి, ఆశీస్సులు తీసుకున్నారు.

ఎస్‌ఐకి నివాళి

ఆమనగల్లు: పట్టణంలోని పోలీసు స్టేషన్ ఆవరణలో ఆదివారం దివంగత ఎస్‌ఐ కాసం హన్మంతరెడ్డి వర్ధంతిని నిర్వహించారు. ఆమనగల్లు ఎస్‌ఐగా పనిచేస్తూ విధి నిర్వహణలో నక్సల్స్ చేతిలో హత్యకు గురయ్యారు. పోలీసు స్టేషన్ ఆవరణలో హన్మంతరెడ్డి విగ్రహానికి సీఐ విజయ్‌కుమార్, కాసం హన్మంతరెడ్డి కుటుంబ సభ్యులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎస్‌ఐ బాల్‌రాంనాయక్, హన్మంతరెడ్డి కుటుంబ సభ్యులు రాంరెడ్డి, సాయిబాబా, జ్యోతి, లక్ష్మి, దయాకిరణ్ పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



ఇబ్రహీంపట్నం రూరల్: గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీపీ కృపేష్, జెడ్పీటీసీ మహిపాల్ అన్నారు. ఆదివారం మండలంలోని పోచారంలో రూ.24 లక్షలతో సీసీరోడ్డు పనులను ఎంపీపీ కృపేష్, జెడ్పీటీసీ మహిపాల్ ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు.

ఆలయ బ్రహ్మోత్సవాల్లో ఎడ్ల పోటీలు



ఆలయ ప్రాంగణంలో ఎడ్ల పోటీలను ప్రారంభిస్తున్న నిర్వాహకులు

కందుకూరు: పులిమామిడి పరిధి శ్రీచీకటి వేంకటేశ్వరస్వామి దేవాలయం బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయ ప్రాంగణంలో ఎద్దులతో బండరాయి లాగే పోటీలు నిర్వహించారు. అందులో మొదటి స్థానంలో నిలిచిన ఎడ్లజత యజమాని వెంకటేశ్‌యాదవ్‌కు రూ.35 వేలు, రెండో స్థానంలో నిలిచిన.. రామాంజనేయులుకు రూ.25 వేలు, మూడో స్థానంలో నిలిచిన.. నవీన్‌నాయుడుకు రూ.15 వేలు నగదు ఆలయ కమిటీ అందజేసింది. ట్రాక్టర్ ట్రాలీతో నిర్వహించిన రివర్స్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన పాపగళ్ల సుధాకర్‌కు రూ.5 వేలు, రెండో స్థానంలో నిలిచిన ఎండీ జహంగీర్‌కు రూ.3 వేల నగదును ఆలయ కమిటీ అందజేసింది. అంతకు ముందు సామూహిక సత్యనారాయణ వ్రతాలు ఆలయ ధర్మకర్త మొకరాల లక్ష్మణ్ శర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

డీఎస్సీ-2008 అభ్యర్థులకు న్యాయం చేయండి



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న అభ్యర్థులు

యాచారం: డీఎస్సీ-2008 అభ్యర్థులకు న్యాయం చేసేలా కృషి చేయాలని, మెరిట్‌లో సెలెక్ట్ అయిన అభ్యర్థులు ఆదివారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. వెంటనే ఉద్యోగవకాశాలు కల్పించాలని రాష్ట్ర హైకోర్టు, సుప్రీంకోర్టు ఉత్తర్వులు కూడా ఇచ్చిందని అన్నారు. ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం 2008 అభ్యర్థులకు న్యాయం చేసిందని గుర్తు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఉద్యోగాలు వచ్చేలా కృషి చేయాలని కోరారు.

అక్రమ కట్టడాన్ని తొలగించాలి



భవనం వద్ద రహదారిపై బైఠాయించి ధర్నా చేస్తున్న కాలనీల వాసులు

మీర్‌పేట: రోడ్డును ఆక్రమించి, నిర్మించిన కట్టడాన్ని తొలగించాలని పలువురు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం మీర్‌పేటలో కాలనీవాసులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడారు. నందిహిల్స్ రోడ్ నెం-21లోని ప్రధాన రహదారిపై ఓ వ్యక్తి రోడ్డును ఆక్రమించి, ఏకంగా నాలుగు అంతస్తుల భవనాన్ని నిర్మించాడని, దీంతో రహదారి ఇరుకుగా మారి తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఎటువంటి అనుమతులు లేకుండా, రహదారిని ఆక్రమించి, సెట్‌బ్యాక్ లేకుండా భవనాన్ని నిర్మిస్తున్న సదరు వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని పలుమార్లు కార్పొరేషన్ టౌన్‌ప్లానింగ్ విభాగంలో ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించకపోతే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. ధర్నాలో నందిహిల్స్, చైతన్య హిల్స్, టీచర్స్‌కాలనీ, విజ్ఞానపురికాలనీ, ప్రశాంతి హిల్స్, శివాహిల్స్, నాగార్జునహిల్స్, సెవెన్స్‌హిల్స్ కాలనీలకు చెందిన 100 మంది పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీచెన్నకేశవస్వామి రథోత్సవం



రథాన్ని ఊరేగిస్తున్న భక్తులు

కడ్తాల్: మండల కేంద్రంలోని ఆలయంలో కొలువైయున్న లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజు ఆదివారం తెల్లవారు జామున స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించిన రథంపై గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున స్వామివారి రథోత్సవంలో పాల్గొని, గోవిందా నామస్మరణతో రథాన్ని ఊరేగించారు. రథోత్సవం సందర్భంగా గ్రామ ప్రధాన వీధులన్నీ భక్తుల గోవింద నామస్మరణతో మార్మోగాయి. యువకులు, భక్తులు రథాన్ని లాగేందుకు పోటీపడ్డారు. రథోత్సవంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని పూజలు జరిపారు. రథోత్సవం సందర్భంగా ఎలాంటి సంఘటనలు జరగకుండా సీఐ శివప్రసాద్ ఆధ్వర్యంలో కడ్తాల్, ఆమనగల్లు, తలకొండపల్లి ఎస్‌ఐలు వరప్రసాద్, బాల్‌రాం, శ్రీకాంత్‌లు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఆంజనేయులు, ఉత్సవ కమిటీ ఛైర్మన్ వేణుగోపాల్, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, నాయకులు నరేందర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, శాయిరెడ్డి, యాదయ్య గౌడ్, వెంకట్‌రెడ్డి, వేదపండితులు వెంకటేశ్వర శర్మ, అర్చకులు శ్రీధర్, వేణుగోపాల్, వెంకటేశ్, రఘు, శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

మెజార్టీ ఎంపీ స్థానాలు మావే..

- చేవెళ్లను సోనియాకు కానుకగా ఇస్తాం
- బీఆర్ఎస్, బీజేపీ రెండూ ఒకటే
- అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలో చేరుతున్న నేతలు
- మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్ఆర్



మహేశ్వరం: పార్టీలో చేరిన వారితో కేఎల్ఆర్ తదితరులు

మహేశ్వరం: త్వరలో జరగనున్న పార్లమెంటు ఎన్నికల్లో చేవెళ్ల ఎంపీ స్థానాన్ని కాంగ్రెస్ కైవసం చేసుకొని, సోనియా గాంధీకి కానుకగా ఇస్తామని మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ యువ నాయకులు కర్రోళ్ల చందు ముదిరాజ్‌తో పాటు పలువురు కార్యకర్తలు కెఎల్ఆర్ సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీజేపీ, బీఆర్ఎస్ ఎన్ని కుట్రలు చేసిన రాష్ట్రంలో మెజార్టీ ఎంపీ స్థానాలు కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందన్నారు. ఆ రెండు పార్టీలు ఒక్కటేనని, కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరుతున్నారని ఆయన వెల్లడించారు. పార్టీకి నియోజకవర్గం కంచుకోట అని, కొందరు పార్టీ నుంచి పదువులు అనుభవించి, కన్నతల్లి లాంటి పార్టీని వదిలి, ఇతర పార్టీలోకి వెళ్లారని ఆరోపించారు. నాయకులు వెళ్లినా, కార్యకర్తలు బలంగా ఉన్నారని పేర్కొన్నారు. త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపునకు శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

కార్యకర్తలకు అండగా ఉంటా..

నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఖాళీ కావడం ఖాయమని, ప్రభుత్వం చేస్తున్న అభివద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కెఎల్ఆర్ కార్యకర్తలకు సూచించారు. కాంగ్రెస్‌తోనే ప్రజాపాలన సాధ్యమని గ్రహించి, ఇతర పార్టీల నుంచి నాయకులు, ప్రజాప్రతినిధులు త్వరలో కాంగ్రెస్‌లో చేరనున్నారని వెల్లడించారు. పార్టీ శ్రేణులకు అండగా ఉంటానని ఆయన చెప్పారు. పార్టీలో చేరిన వారిలో శివ, శ్రీనివాస్, రాఘవేందర్, సతీష్, ఉపేందర్, సాయినాథ్, ప్రవీణ్, శేఖర్, రాజు, జగదీష్, చిన్నా, శ్రీనివాస్ ఉన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, మండల నాయకులు కాకి ఈశ్వర్, శివగంగ ఆలయ కమిటీ ఛైర్మన్ అల్లె కుమార్, కూన యాదయ్య, లాజర్, రాములు, రఘుపతి, వగ్గు శ్రీకాంత్, జంగయ్య పరమేష్, చందు, మహేందర్ పలువురు పాల్గొన్నారు.

చెక్కుచెదరని చరిత్రకు చిరునామా..



కందుకూరు: పార్టీలో చేరిన వారితో కేఎల్ఆర్

కందుకూరు: చెక్కుచెదరని చరిత్రకు చిరునామా కాంగ్రెస్ పార్టీ అని మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్ అన్నారు. కాంగ్రెస్ మండల మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాణాప్రతాప్‌రెడ్డి, నాయకులు ప్రతాప్‌రెడ్డి, ఎండీ అఖిల్, ఎండీ రహీమ్ ఆధ్వర్యంలో మండల పరిధి లేమూరుకు చెందిన మైనార్టీ నాయకులు ఎం.రియాన్, ఎండీ జహంగీర్, ఎండీ మోబిన్, ఫయాజ్, అశ్వక్, ఇలియాస్, ఖాదర్, మోసిన్, అబుజర్, రజీయోద్దీన్, మతిన్, అక్బర్, ఆలీ, తబ్రేజ్, అంజద్, చోటఫయాజ్, ఖలీల్, నిజాం, జావీద్, నజీమ్, బషీర్‌లు పార్టీలో చేరగా.. వారికి కేఎల్ఆర్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్య సముపార్జన నుంచి నేటి వరకు దేశాభివృద్ధిలో కీలకభూమిక పోషించిన పార్టీగా ప్రజల గుండెల్లో కాంగ్రెస్ చిరస్థాయిగా నిలిచిందని కొనియాడారు. పార్టీ మరింత బలోపేతం అయ్యేలా కార్యకర్తలు సైనికుల్లా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు ఎస్.కృష్ణనాయక్, మాజీ సర్పంచ్ గూడూరు కొండారెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మూల హన్మంత్‌రెడ్డి, నాయకులు కాకి ఈశ్వర్, ఢిల్లీ శ్రీధర్, అఫ్జల్‌బేగ్, రవీందర్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి, కిషన్, సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.